లోక్ అదాలత్‌తో శాశ్వత పరిష్కారం


గుత్తిలో లోక్ అదాలత్ నిర్వహిస్తున్న న్యాయమూర్తులు

గుత్తి: లోక్ అదాలత్ ద్వారా కేసులకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని న్యాయమూర్తులు పేర్కొన్నారు. పట్టణంలోని ఏడీజే కోర్టు, జూనియర్ సివిల్ జడ్జి కోర్టు, సీనియర్ సివిల్ జడ్జి కోర్టుల్లో ఏడీజే సాధుబాబు ఆధ్వర్యంలో శనివారం జాతీయ లోక్ అదాలత్ నిర్వహించారు. అన్ని శాఖల అధికారులు, పోలీసులు , న్యాయవాదులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏడీజే, జూనియర్ సివిల్ జడ్జి, సీనియర్ సివిల్ జడ్జి కోర్టుల్లో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు జాతీయ లోక్ అదాలత్ నిర్వహించారు. మొత్తం 656 కేసులను పరిష్కరించి బాధితులకు రూ.1.20 కోట్ల పరిహారం చెల్లించేలా తీర్పులు వెలువరించారు. ఇందులో పిటీ కేసులు 565, యాక్సిడెంట్ కేసులు 10, ఓఎస్, ఏపీలు 08, సీసీ, ఐపీసీ లు 43, ఎక్సైజ్ 28, భరణం కేసులు 2 ఉన్నాయి. కార్యక్రమలో ఏడీజే సాధుబాబుతో పాటు సీనియర్ సివిల్ జడ్జి కాశీ విశ్వనాథ ఆచారి, జూనియర్ సివిల్ జడ్జి దీప్తి, ఏపీపీ బుసా సుధీర్‌రెడ్డి, ఏజీపీ తిమ్మారెడ్డి, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు మనోహర్ బాబు, మాజీ ఏజీపీ విజయ భాస్కర్, న్యాయవాదులు కుమార్, చంద్రకాంత్‌రెడ్డి, సూరి, రవీంద్ర, ఓబులేసు, నూర్, సోమశేఖర్, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

యాడికి: తాడిపత్రి కోర్టులో శనివారం నిర్వహించిన లోక్ అదాలత్ ద్వారా మండలానికి సంబంధించి 61 కేసులు పరిష్కారమైనట్లు ఎస్‌ఐ గురుప్రసాద్‌రెడ్డి తెలిపారు. గత పదేళ్ల నుంచి అపరిష్కృతంగా ఉన్న పెట్టీ కేసులను రాజీ చేసినట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

గుంతకల్లు: స్థానిక జేఎఫ్‌సీఎం కోర్టులో శనివారం జూనియర్ సివిల్ జడ్జి జీ మంజుల ఆధ్వర్యంలో జాతీయ లోక్ అదాలత్ నిర్వహించారు. జేసీజీ కోర్టు పరిధిలోని దాదాపు 82 కేసులు, రైల్వే కోర్టుకు సంబంధించి దాదపు 630 కేసులు, ఎస్‌జేఎస్‌సీఎం 676 కేసులు, పీఎల్‌సీ కేసులు 43 మొత్తం 1,425 కేసులు పరిష్కారమైనట్లు కోర్టు అధికారులు వెల్లడించారు. కార్యక్రమంలో లోక్ అదాలత్ సభ్యులు గోపాల్‌కృష్ణ, పార్వతి, ఏపీపీ హేమలత, న్యాయవాదులు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

గార్లదిన్నె: లోక్ అదాలత్‌తో కేసులు సత్వర పరిష్కారమవుతాయని ఎస్‌ఐ సాగర్ పేర్కొన్నారు. శనివారం ఎస్‌ఐ విలేకరులతో మాట్లాడారు. అనంతపురము జిల్లా కోర్టులో శనివారం జరిగిన లోక్ అదాలత్‌లో మండలవ్యాప్తంగా 2018 నుంచి నమోదైన 20 కేసులు పరిష్కారమయ్యాయన్నారు. ఇరుపక్షాలు శాంతియుత వాతావరణంలో కేసులు పరిష్కరించుకోవచ్చన్నారు.


తాడిపత్రిలో లోక్ అదాలత్ నిర్వహిస్తున్న జడ్జి చంద్రశేఖర్‌రెడ్డి

రాజీ మార్గమే రాజమార్గం

తాడిపత్రి అర్బన్: రాజీ మార్గమే రాజమార్గమని, రాజీ పడటంతో ఇరువర్గాలు కేసులో గెలిచినట్లేనని తాడిపత్రి కోర్టు జడ్జి చంద్రశేఖర్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం స్థానిక కోర్టులో లోక్ అదాలత్ నిర్వహించారు. ఈసందర్భంగా జడ్జి చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ ప్రతి పౌరుడు భారత రాజ్యాంగంపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. ప్రతి వ్యక్తికి జీవించే హక్కు, సమానత్వపు హక్కు ఉందని వాటికి భంగం కలిగినపుడు కోర్టును ఆశ్రయించాలని తెలిపారు. నేటి సాంకేతిక పరిజ్ఞానాన్ని యువత విజ్ఞానాన్ని పెంచుకునేందుకు వినియోగించుకోవాలన్నారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు వినియోగించవద్దని తెలిపారు. అనంతరం సివిల్, క్రిమినల్ తదితర 640 కేసులను పరిష్కరించారు.

ప్రభుత్వాస్పత్రుల్లో కాన్పులు సురక్షితం


గర్భిణులకు పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యురాలు కీర్తన

యల్లనూరు: ప్రభుత్వాస్పత్రుల్లో కాన్పులు సురక్షితమని వైద్యురాలు కీర్తన పేర్కొన్నారు. తిమ్మంపల్లి, యల్లనూరు పీహెచ్‌సీల్లో శనివారం ప్రధానమంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్ కింద వైద్యాధికారులు కీర్తన, లోకేష్ కుమార్ గర్భిణులకు వైద్య పరీక్షలు చేశారు. అనంతరం వైద్యులు రక్తహీనత నివారణ, పౌష్టికాహారం, ప్రసవాలు, తల్లిపాల ప్రాముఖ్యతపై వివరించారు. గర్భిణులకు కెనరాబ్యాంకు ఉద్యోగి ఆత్మారామ్‌రెడ్డి భోజన వసతిని కల్పించారు. కార్యక్రమంలో పీహెచ్‌ఎన్ దీనాకుమారి, సూపర్‌వైజర్ రాము, విజయలక్ష్మి, ఎంఎల్‌హెచ్‌పీలు, ఏఎన్‌ఎం, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

గార్లదిన్నె: హైరిస్క్ గర్భిణులు క్రమం తప్పక వైద్య పరీక్షలు చేయించుకోవాలని పీహెచ్‌సీ డాక్టర్ మంజుల పేర్కొన్నారు.శనివారం స్థానిక పీహెచ్‌సీలో ప్రధాన మంత్రి సురక్ష మాతృత్వ అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా డాక్టర్ మంజుల హైరిస్క్ గర్భిణులకు బీపీ, షుగర్, హిమోగ్లోబిన్ తదితర పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. ఆరోగ్య విస్తరణ అధికారి నాగేశ్వరయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

రక్తదానంపై అపోహలు వీడండి


రక్తదానం చేస్తున్న దృశ్యం

గుంతకల్లు: రక్తదానంపై అపోహలు వీడాలని ప్రభుత్వ ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ హరిప్రసాద్ పిలుపునిచ్చారు. భారత రాజ్యాంగ అవగాహన వేదిక ఆధ్వర్యంలో శనివారం ప్రభుత్వ ఆస్పత్రిలోని బ్లడ్ బ్యాంకులో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ఇండియన్ సోషల్ సర్వీస్ ఆర్గనైజేషన్ సభ్యులు రక్తదానం చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ హరిప్రసాద్ మాట్లాడుతూ ఆపదలో ఉన్న క్షతగ్రాతులకు, నిరుపేద రోగులకు రక్తదానం చేయడం ద్వారా ప్రాణదాతలుగా నిలుస్తారన్నారు. అన్ని దానల్లో కన్న రక్తదానం గొప్పదని, దాతలు ఇచ్చిన రక్తంను దుర్వినియోగం చేయకుండా చూసుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందిన గుర్తుచేశారు. కార్యక్రమంలో భారత రాజ్యాంగ వేదిక కో కన్వీనర్లు జింకల వేణుగోపాల్, రామకృష్ణ, చంద్రశేఖర్, ఇండియన్ సోషల్ సర్వీసు ఆర్గనైజేషన్ అధ్యక్షుడు మహేష్, టెక్నీషియన్ ఉమాదేవి తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

కూడేరు: మండలంలోని లెప్రసి కాలనీ శివారు ప్రాంతంలో అనంతపురం-బళ్లారి ప్రధాన రహదారిపై శనివారం ఆగి ఉన్న లారీని ద్విచక్ర వాహనం ఢీకొట్టింది. దీంతో ద్విచక్రవాహనంలో ఉన్న రాకేష్ గాయపడ్డాడు. అనంతపురానికి చెందిన రాకేష్ ద్విచక్ర వాహనంలో ఉరవకొండకు వెళ్తుండగా ఈ ప్రమాదం చోటు చేసుకుంది. అతడిని వెంటనే ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

క్లుప్తంగా

మాజీ సర్పంచ్‌కు నివాళి


నివాళులర్పిస్తున్న మంజునాథ్‌రెడ్డి

గుత్తి రూరల్: మండలంలోని ఊబిచెర్ల గ్రామ మాజీ సర్పంచ్, వైస్ ఎంపీపీ నాగేశ్వరమ్మ భర్త లక్ష్మీనారాయణ మృతి పట్ల శనివారం పలువురు నివాళులర్పించారు. కబడ్డీ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు, వైఎస్సార్‌సీపీ యువ నాయకుడు మంజునాథ్‌రెడ్డి, ఏడీసీసీ బ్యాంకు మాజీ చైర్మన్ పామిడి వీరా, కౌన్సిలర్ వరదరాజులు, మాజీ జెడ్పీటీసీ ప్రవీణ్‌కుమార్ యాదవ్ గ్రామానికి వెళ్లి లక్ష్మీనారాయణ మృతదేహానికి పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. కుటుంబసభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు. అధైర్య పడొద్దని ఎమ్మెల్యే వై.వెంకట్రామిరెడ్డి, పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో సర్పంచ్ చిదంబరి, వైఎస్సార్‌సీపీ నాయకులు రామరంగారెడ్డి, నారాయణస్వామి, గోవిందు, డీలర్ శ్రీనివాసులు, శివ, రామకృష్ణ, సుంకన్న, నరశింహ పాల్గొన్నారు.

రేపు డయల్ యువర్ డీఎం

తాడిపత్రి అర్బన్: ప్రయాణికుల సలహాలు, సూచనలు తెలుసుకునేందుకు సోమవారం డయల్ యువర్ డీఎం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఆర్టీసీ డీఎం శంకర్ శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. స్థానిక డీఎం కార్యాలయంలో మధ్యాహ్నం 12 గంటల నుంచి 1 గంట వరకు కార్యక్రమం జరుగుతుందని తెలిపారు. ప్రయాణికులు తమ విలువైన సూచనలను 9959225856 నంబర్‌లో తెలియజేయాలని సూచించారు.

ఘనంగా ముందస్తు క్రిస్మస్ వేడుకలు


పాస్టర్లకు బహుమతులు ప్రదానం చేస్తున్న దృశ్యం

గుత్తి: మున్సిపాలిటీ పరిధిలోని జడ్ వీరారెడ్డి కాలనీలో లార్డ్ జీసస్ క్రైస్ట్ చర్చ్ లో శనివారం పాస్టర్ రెవరెండ్ ధర్మేంద్ర సింగ్ ఆధ్వర్యంలో ముందస్తు క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులు పాస్టర్ మాథ్యూ, డాక్టర్ రవి కుమార్‌లు హాజరయ్యారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి క్రిస్మస్ సంబరాలు నిర్వహించారు. పాస్టర్ రెవరెండ్ ధర్మేంద్ర సింగ్ ఏసు ప్రభువు జీవిత చరిత్ర, గొప్పతనాన్ని వివరించారు. అనంతరం గుత్తి, పెద్దవడుగూరు, పామిడి మండలాల పాస్టర్లకు క్రిస్మస్ బహుమతులు అందజేశారు. అనంతరం పాస్టర్ ధర్మేంద్ర సింగ్‌ను పాస్టర్లందరూ శాలువాలలో సన్మానించి ముందస్తుగా క్రిస్మస్ శుభాకాంక్షలు తెలియజేశారు.

రామరాజుపల్లెలో ఫ్యామిలీ ఫిజీషియన్ సేవలు


రోగి ఇంటి వద్ద సేవలు అందిస్తున్న డాక్టర్ అప్పయ్య

యాడికి: ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమం ద్వారా రోగులకు ఇంటి వద్దే వైద్య సేవలు అందిస్తున్నామని రాయలచెరువు పీహెచ్‌సీ వైద్యాధికారి అప్పయ్య తెలిపారు. శనివారం రామరాజుపల్లెలో 104 వాహనం ద్వారా 40 మంది రోగులకు వైద్య సేవలు అందించారు. గ్రామంలో మంచానికే పరిమితమైన రోగుల వద్దకు వెళ్లి వైద్య సేవలతో మందులు అందించినట్లు వైద్యాధికారి తెలిపారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

'ఆడుదాం బెంగళూరు' పోస్టర్ల విడుదల


పోస్టర్లు విడుదల చేసిన ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి, సాంబశివారెడ్డి

శింగనమల: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి జన్మదినాన్ని(డిసెంబరు 21) పురస్కరించుకొని ఆడుదాం బెంగళూరు క్రీడాపోటీలను నిర్వహించనున్నారు. ఈమేరకు శనివారం పోటీలకు సంబంధించిన పోస్టర్లను ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి, ప్రభుత్వ విద్యా సలహాదారు ఆలూరు సాంబశివారెడ్డి విడుదల చేశారు. ఆడుదాం ఆంధ్రా స్ఫూర్తితో ఆడుదాం బెంగళూరు పోటీలను నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్‌సీపీ ఐటీ విభాగం నాయకుడు ప్రతాప్‌రెడ్డి తెలిపారు. ఈనెల 23,24 తేదీల్లో సర్జాపూర్ రోడ్డులోని కొడితి గ్రామ సమీపంలో బీకే క్రికెట్ గ్రౌండ్‌లో పోటీలను నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, ఐటీ విభాగం నాయకులు పాల్గొన్నారు.

మొక్కలు నాటని వారికి నోటీసులు ఇవ్వండి


ప్రజావేదిక నిర్వహిస్తున్న దృశ్యం

తాడిపత్రిటౌన్: డ్రైలాండ్ హార్టీకల్చర్ కింద పండ్ల మొక్కలు నాటుకోని లబ్దిదారులకు నోటీసులు అందజేయాలని డ్వామా ఏపీడీ సుధాకర్‌రెడ్డి ఉపాధి హామీ అధికారులను ఆదేశించారు. తాడిపత్రి మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో శనివారం సామాజిక తనిఖీపై ప్రజావేదిక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సామాజిక తనిఖీ బృందం సభ్యులు తనిఖీలో వెల్లడైన విషయాలను చదివి వినిపించారు. మండలంలో ఉపాధి హామీ కింద రూ.54 కోట్లు, పంచాయతీరాజ్ కింద రూ.57 కోట్లతో పనులు జరిగినట్లు తనిఖీ బృందం సభ్యులు తెలిపారు. ఉపాధి హామీ పనుల్లో జరిగిన అవకతవకలకు సంబంధించి బాధ్యుల నుంచి రూ.30 వేలు రికవరీ చేయాలని అధికారులు ఆదేశాలు జారీ చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ సరస్వతి, ఎంపీటీసీ కిశోర్‌రెడ్డి, విజిలెన్స్ అధికారి రమణారెడ్డి, ఏపీడీ వెంకటరత్నం, అంబుడ్స్‌మన్ మధుసూదన్, ఎంపీడీఓ రంగరావు, ఏపీఓ నాగరాజు ఆయా గ్రామాల ఫీల్డ్ , టెక్నికల్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

పునరుత్పాదక వనరులు వినియోగించాలి


మాట్లాడుతున్న పర్యావరణ సంరక్షకుడు పురుషోత్తం రెడ్డి

గుత్తి: పర్యావరణ పరిరక్షణ కోసం పునరుత్పాదక ఇంధన వనరులు వినియోగించాలని ప్రముఖ పర్యావరణ సంరక్షకుడు పురుషోత్తం రెడ్డి పేర్కొన్నారు. పట్టణ శివారులోని గేట్స్ ఇంజినీరింగ్ కాలేజీలో శనివారం పర్యావరణ మార్పులు- ప్రకృతి వైపరీత్యాలు అనే అంశంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ 1990 నుంచి పర్యావరణంలో అనేక ప్రమాదకరమైన మార్పులు చోటు చేసుకున్నాయన్నారు. ప్రమాదకరమైన రీతిలో ఉన్న పర్యావరణ మార్పులను నివారించాలంటే పెట్రోల్, డీజిల్, బొగ్గు వంటి వాటి స్థానంలో పునరుత్పాదక శక్తి వనరులను వినియోగించాలన్నారు. యువత సమగ్ర ఆలోచనలు, సమష్టి కృషి ద్వారా తమ సాంకేతిక విజ్ఞానంతో పర్యావరణాన్ని పరిరక్షించుకోవాలన్నారు. ప్రమాదకరమైన పర్యావరణ మార్పుల వల్ల వ్యవసాయ భూములు సారం కోల్పోతున్నాయన్నారు. సేంద్రీయ ఎరువులను రైతులు వాడేలా అవగాహన కల్పించాలన్నారు. ప్రకృతి వ్యవసాయంపై ప్రజలను చైతన్యం చేయాలన్నారు. కార్యక్రమంలో మదనపల్లెకు చెందిన ప్రకృతి వనం వ్యవస్థాపకుడు ప్రసాద్, పర్యావరణ పరిరక్షణ ప్రచార కర్త నరసింహారెడ్డి, ప్రముఖ గాయకులు లెనిన్ బాబు, గేట్స్ కరస్పాండెంట్ వీకే పద్మావతమ్మ, ప్రిన్సిపాల్ డాక్టర్ సురయ, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బలిజలు అన్ని రంగాల్లో రాణించాలి


ప్రమాణం చేస్తున్న బలిజ సంఘం మహిళా విభాగం నేతలు

గుంతకల్లు: బలిజలు అన్ని రంగాల్లో రాణించాలని వక్తలు పిలుపునిచ్చారు. శనివారం స్థానిక సాయినగర్‌లోని బలిజ కళ్యాణమండపంలో బలిజ సంఘం డెవలప్‌మెంట్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో ఆత్మీయ సమ్మేళనం ఘనంగా నిర్వహించారు. తొలుత బలిజలు శ్రీ కృష్ణదేవరాయలు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పట్టణ బలిజ సంఘం మహిళ విభాగం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా వక్కల ఉమ, వనజభూషణ్, కోశాధికారిగా డీ.శైలజ,ఉపాధ్యక్షురాలిగా ప్రేమలత, కార్యదర్శులుగా ఆశలత, హరిణి, భవాని, సహాయ కార్యదర్శులుగా లత, రమాదేవి, పూలకృష్ణవేణిలతోపాటు మరో పది మందిని ఈసీ మెంబర్లుగా ఎన్నుకున్నారు. అనంతరం వక్తలు మాట్లాడుతూ ఐక్యంగా ఉన్నప్పుడే హక్కులను సాధించుకోవడానికి ఆస్కారం ఉంటుందన్నారు. అనంతరం వందలాదిగా తరలివచ్చిన బలిజలు సామూహిక వనభోజనలు చేశారు. కార్యక్రమంలో వెల్ఫేర్ సొసైటీ అధ్యక్ష, కార్యదర్శులు పూల రమణ, గోవిందరాజులు, కోశాధికారి సంజీవరాయుడు, జిల్లా నాయకులు రవికాంత్ రమణ, పీవీ రమణ, నాయకులు మనీశ్వరప్ప, కసాపురం చంద్రన్న, టీకే మధు, పవన్ ప్రింటర్ రవికుమార్, కృష్టారెడ్డి, సత్య, పట్నం రామాంజినేయులు, రఘు, శివరంగప్రసాద్ పాల్గొన్నారు.

మార్మోగిన అయ్యప్ప నామస్మరణ


రైల్వేఫీడర్ రోడ్డులోని అయ్యప్ప ఆలయంలో పుష్పయాగం చేస్తున్న మాలధారులు

అనంతపురం కల్చరల్: స్వామియే శరణమయ్యప్ప అంటూ హరిహరనాథుడి నామస్మరణతో ఆలయం మార్మోగింది. శనివారం సాయంత్రం నగర శివారులోని రామ్‌నగర్ 80 అడుగుల రోడ్డులో వెలసిన అయ్యప్ప స్వామి ఆలయం అయ్యప్ప స్వామి కీర్తనలతో ఆలయం ప్రతిధ్వనించింది. ఆలయంలోని మండపంలో పెద్ద సంఖ్యలో పాల్గొన్న అయ్యప్ప స్వామి దీక్షాదారులు, శివమాల దారుల మధ్య స్వామివారి ఉత్సవ మూర్తికి పెద్ద ఎత్తున పుష్పాభిషేకం నిర్వహించారు. అనంతరం అయ్యప్ప స్వామి భక్తి గీతాలు కీర్తనలు భజనలు సాగాయి. వందలాది మంది అయ్యప్ప స్వామి దీక్ష దారులు, శివమాల, వెంకటేశ్వర మాలదారులకు పెద్ద ఎత్తున అన్న ప్రసాద వితరణ చేశారు. కార్యక్రమంలో అయ్యప్ప స్వామి ఆలయ కమిటీ అధ్యక్షుడు హరినాథ్ రెడ్డి, ఉపాధ్యక్షుడు నెట్టెం సూర్యనారాయణ, ప్రధాన కార్యదర్శి సూర్యనారాయణ, సహాయ కార్యదర్శి శ్రీనివాసులు, సుధాకర్, తదితరులు పాల్గొన్నారు.

పదో తరగతి పరీక్షలు జీవితంలో తొలిమెట్టు


సమావేశంలో మాట్లాడుతున్న జేడీ మధుసూదన్‌రావు

గుత్తి రూరల్: ఉన్నత చదువులు చదివి జీవితంలో స్థిరపడేందుకు ప్రతి విద్యార్థికి పదో తరగతి పరీక్షలు తొలి మెట్టులాంటివని సాంఘిక సంక్షేమ శాఖ జాయింట్ డైరెక్టర్ మధుసూదన్‌రావు సూచించారు. పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయంలో శనివారం గుత్తి ఏఎస్‌డబ్ల్యూఓ పరిధిలోని పది మండలాలకు చెందిన పదో తరగతి విద్యార్థులకు ప్రేరణ శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పరీక్షలకు ఎలా సన్నద్ధం కావాలి, పరీక్షలు రాసే విధానంపై అవగాహన కల్పించారు. పది పరీక్షలకు ఇంకా సమయం ఉందని రోజు పాఠశాలలో ఉపాధ్యాయులతో సందేహాలను నివృత్తి చేసుకోవాలని సూచించారు. పరీక్షలంటే భయపడకుండా ఒక లక్ష్యాన్ని ఏర్పరచుకొని చదివి మంచి మార్కులతో ఉత్తీర్ణులు అవ్వాలని తెలిపారు. కార్యక్రమంలో వార్డెన్లు మహబూబ్‌బాషా, ఆదినారాయణ, సంజీవరాయుడు, ఈశ్వరమ్మ, జ్ఞానమ్మ, ఎంబీఏ కళాశాల అధ్యాపకుడు సుధీంద్రనాథ్, విశ్రాంత ఉపాధ్యాయుడు రామాంజనేయులు పాల్గొన్నారు.

తప్పిన పెను ప్రమాదం


శివయ్య ఇంటి ముందు ధ్వంసమైన సిమెంట్ రేకు


గ్యాస్ లీకేజీతో ధ్వంసమైన పొగసట్టం

పెద్దవడుగూరు: మండల కేంద్రంలో శుక్రవారం రాత్రి గ్యాస్ లీకేజీ ఘటనలో పెను ప్రమాదం తప్పింది. వివరాలు.. మండల కేంద్రంలోని వంకవీధిలో రాజగోపాల్‌రెడ్డి (రాజారెడ్డి) నివాసం ఉంటున్నాడు. భార్య ఊరికి పోవడంతో రాజారెడ్డి పక్కన సోదరుడి ఇంట్లో భోజనం చేసి తన ఇంటిలో నిద్రించాడు. భార్య గ్యాస్ రెగ్యులేటర్ ఆఫ్ చేయకుండా పోయింది. దీంతో గ్యాస్ లీకేజీ అయింది. వంట గదిలో బల్బు వెలుగుతుండటంతో ఒక్కసారిగా పేలుడు సంభవించింది. పెద్ద ఎత్తున శబ్దం రావడంతో చుట్టుపక్కల వారు భయాందోళనకు గురయ్యారు. ఘటనలో పొగసట్టం బండ ఎగిరి పక్కకు పడింది. ఇంటి గవాక్షికున్న అద్దం ఇంటి పక్కనున్న శివయ్య రేకులపై పడటడంతో ధ్వంసమయ్యాయి. ఘటనలో మరోగదిలో ఉన్న రాజారెడ్డి సురక్షితంగా బయటపడటంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు. వంట గదిలో ఉన్న బియ్యం ఇతర వస్తువులు మసిబారాయి. జరిగిన ప్రమాదం పై పోలీసులు ఆరా తీశారు.

ముస్లిం మైనార్టీల సంక్షేమానికి జగన్ కృషి

అనంతపురం అర్బన్: ముస్లిం మైనార్టీల సంక్షేమానికి కృషి చేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి సంఘం తరఫున కృతజ్ఞతలు తెలియజేస్తున్నట్లు ఆల్ మైనార్టీ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ (ఆల్‌మేవా) జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు షేక్షావలి, ఫరూర్ అహమ్మద్ తెలిపారు. శనివారం కలెక్టరేట్ సమీపంలో ట్రెజరీ ఉద్యోగులు సంఘం కార్యాలయంలో నిర్వహించిన ఆల్‌మేవా సమావేశంలో వారు మాట్లాడారు.

రాష్ట్ర కమిటీ ఎన్నికలకు సిద్ధం కావాలి..

ఆల్‌మేవా రాష్ట్ర కమిటీ ఎన్నికలకు ఉమ్మడి అనంతపురం జిల్లాలో పని చేస్తున్న ముస్లిం, క్రిస్టియన్ ఉద్యోగులు సిద్ధం కావాలని సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు షేక్షావలి, ఫరూర్ అహమ్మద్ తెలిపారు. ఈనెల 25న కర్నూలు సంఘం రాష్ట్ర కమిటీ ఎన్నికలు జరగనున్నాయన్నారు. నంద్యాలలో ముస్లిం మైనార్టీల సంక్షేమానికి ప్రభుత్వం ఆధ్వర్యంలో రూ.12 కోట్లతో నూతన ఉర్దూ జూనియర్ కళాశాల, మైనార్టీ వసతి గృహం, వర్కింగ్ ఉమెన్స్ హాస్టల్, సద్భావన బిల్డింగ్ ప్రీ మెట్రిక్, పోస్ట్ మెట్రిక్ విద్యార్థినీ విద్యార్థులకు నూఏతన భవనాల నిరాణానికి కృషి చేస్తున్న ముఖ్యమంత్రికి ధన్యావాదాలు తెలియజేసుకుంటున్నామన్నారు. అనంతరం ముస్లిం మైనార్టీ ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించారు.

సమస్యలు పరిష్కరించాలి..

మైనారిటీల సంక్షేమం కోసం నిర్దేశించిన ప్రధానమంత్రి 15 సూత్రాల మైనార్టీ పథకాన్ని జిల్లాలో అమలు చేయాలన్నారు. విద్య, ఉద్యోగ, ఉపాధి రంగంలో 15 శాతం రిజర్వేషన్లను అమలు చేయాలన్నారు. రాష్ట్రంలో ఆక్రమణలకు గురైన వక్ఫ్ ఆస్తులను ప్రభుత్వం పరరిక్షించాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల్లో మైనారిటీలకు దామాషా ప్రకారం వాటా కేటాయింపులు చేయాలన్నారు. మైనారిటీ విద్యావంతులకు పోటీ పరీక్షల్లో తర్ఫీదు ఇచ్చేందుకు ప్రతి జిల్లాలో మైనారిటీ స్టడీ సెంటర్ ఏర్పాటుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వ ఉర్దూ పాఠశాలల్లో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలన్నారు. కర్నూలు లోని అబ్దుల్ హక్ విశ్వవిద్యాలయంలోని ఉద్యోగులకు పెండింగ్‌లో ఉన్న వేతనాలను మంజూరు చేయాలన్నారు. సమస్యల ప్రభుత్వం పరిష్కరించాలని కోరుతూ తీర్మానం చేశారు. రాష్ట్ర సహాధ్యక్షులు ఫక్రుద్దీన్, జిల్లా కోశాధికారి దౌలా, ఉపాధ్యక్షుడు జిలాన్, నాయకులు అశ్రఫ్‌అలీ, ఏఎంబాషా, అన్వర్, అబ్దుల్‌రసూల్ పాల్గొన్నారు.

ఘనంగా పిరమిడ్ ధ్యాన కేంద్ర వార్షికోత్సవం

ఉరవకొండ: పట్టణంలోని లోబ్‌సాంగ్ రాంపా పిరమిడ్ ధ్యాన కేంద్రం 30వ వార్షికోత్సవ ధ్యాన సంబరాల్లో భాగంగా శనివారం శాఖాహర ర్యాలీ నిర్వహించారు. ధ్యానకేంద్రం ప్రతినిధులు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఆరోగ్యకరమైన జీవితం కోసం ధ్యానం చేయడంతో పాటు శాఖాహారం తీసుకోవాలన్నారు. అనంతరం పిరమిడ్ ధ్యాన కేంద్రంలో ధ్యానం విశిష్టతను వివరించారు. ఈ సందర్భంగా అమ్మతొలి దైవం సంస్థ ఆధ్వర్యంలో కూచిపూడి, భవరత నాట్యం ప్రదర్శనలు నిర్వహించారు.

ఎమ్మెల్యే చొరవతో నీటి సమస్యకు శాశ్వత పరిష్కారం


గన్నెవారిపల్లి కాలనీలో పూర్తయిన నీటి సంపు

- 20 లక్షల లీటర్ల నీటి సంపు నిర్మాణం పూర్తి

తాడిపత్రిటౌన్: గన్నెవారిపల్లి కాలనీలో శాశ్వతంగా నీటి సమస్యను పరిష్కరించేందుకు ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి చొరవ చూపారు. ఇందుకోసం కాలనీలో ఉన్న ఆర్‌డబ్ల్యూఎస్ కార్యాలయంలో దాదాపు 21 లక్షల వ్యయంతో దాదాపు 20 లక్షల లీటర్ల సామర్థ్యం గల నీటి సంపు నిర్మాణం పూర్తవుతోంది. వివరాలు..తాడిపత్రి పట్టణాభివృద్ధిలో భాగంగా గన్నెవారిపల్లి కాలనీ శరవేగంగా విస్తరిస్తోంది. దీంతో కాలనీలో తరచూ నీటి సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి. నీటి సమస్యను పరిష్కరించాలని పలు దఫాలుగా కాలనీవాసులు ఎమ్మెల్యేను కోరడంతో శాశ్వతంగా నీటి సమస్యకు ఆయన పరిష్కారం చూపారు. పెన్నానదిలో కొత్తగా ఏర్పాటు చేసిన మూడు బోర్లలో నీటిని సంపునకు తీసుకొచ్చి గన్నెవారిపల్లి సచివాలయం -2కు నీటిని మళ్లించేందుకు అధికారులు ప్రణాళికలు సిద్ధం చేశారు. ఇందులో భాగాంగా దాదాపు 20 లక్షల లీటర్ల సామర్థ్యంతో సంపు నిర్మాణం చేపట్టారు. పనులు దాదాపు పూర్తి కావడంతో త్వరలోనే నీటి సమస్య తీరుతుందని కాలనీ వాసులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డికి కృతజ్ఞతలు తెలియజేస్తున్నారు.